సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

పురోగతిలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. 8లో



పండుగల వేళ కరోనా అలజడి

వరుసగా పండుగలు వస్తున్న వేళ కరోనా అలజడి మొదలవడంతో భక్తులు, ఆలయాల నిర్వాహకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 27° / 15°

జిల్లాలో శుక్రవారం చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం కూడా కనిష్ట ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

తాగునీటి ప్రాజెక్టును పరిశీలించిన సీఈ



ప్రాజెక్టును పరిశీలిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం మామునూరులోని తాగునీటి ప్రాజెక్టును మిషన్ భగీరథ స్కీం చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ప్రాజెక్టులోని యంత్రాలు, మామునూరుపేట చెరువును పరిశీలించిన ఆయన ప్రాజెక్టు ద్వారా ఏయే గ్రామాల ప్రజలకు తాగునీరు అందుతుందో వివరాలు ఆరా తీశారు. డీఈ నర్సింహారావు, ఏఈ శ్రీనివాస్ పలు అంశాలను సీఈకి వివరించారు. అలాగే, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నర్సింహారావు,బొగ్గుల శ్రీనివాసరెడ్డి, బండారు రామారావు తదితరులు సీఈని కలిసి సమస్యలు తెలిపారు.

ప్రతీ సోమ, గురువారాల్లో ప్రజాదివస్



ఫిర్యాదులు వింటున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇక నుంచి ప్రతీ సోమ, గురువారాల్లో ప్రజాదివస్(గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. అందులో భాగంగా గురువారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురి నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను సీపీ ఆదేశించారు.

తెల్లచేపల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపాలి



సర్టిఫికెట్లు అందుకుంటున్న మత్స్యకారులు

కూసుమంచి: తెలంగాణను తెల్లచేపల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపేందుకు మత్స్యకారులు కృషిచేయాలని జనగామ జిల్లా మత్స్యశాఖ అధికారి నాగుల్‌నాయక్ సూచించారు. కూసుమంచి మండలం పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో వివిధ జిల్లాల మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా నాగుల్‌నాయక్ మాట్లాడుతూ అన్నివర్గాలకు అందుబాటులో ఉండే చేపలు పోషక విలువలు కలిగిన ఆహారమని తెలిపారు. ఈమేరకు డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి చేయాల్సిన అవసరముందని చెప్పారు. గడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త లవకుమార్, పాలేరు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త రవీందర్ మాట్లాడగా శిక్షణలో పాల్గొన్న మత్స్యకారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఖమ్మం మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: పండుగలు, వారాంతపు సెలవుల కారణంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు. ఈనెల 23వ తేదీ శనివారం ముక్కోటి ఏకాదశి, వారాంతపు సెలవు, 24న ఆదివారం, 25 సోమవారం క్రిస్మస్, 26న మంగళవారం బాక్సింగ్ డే సెలవులు వచ్చాయని పేర్కొన్నారు. తిరిగి 27వ తేదీ బుధవారం మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలవుతాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని కోరారు. కాగా, 23వ తేదీ శనివారం నిర్దేశిత జిన్నింగ్ మిల్లుల్లో మాత్రం సీసీఐ ఆధ్వర్యాన పత్తి కొనుగోళ్లు జరుగుతాయని కార్యదర్శి తెలిపారు.

రేపు స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల స్థాయి పురుషుల, మహిళల స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 23న శనివారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జోన్ కార్యదర్శి డాక్టర్. బి.వెంకన్న తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు అర్హత ఫారంతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ మెమోలతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 94412 36384 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హ్యాపీ జర్నీ!



మహాలక్ష్మి పేరిట ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వారిలో ఆనందాన్ని నింపింది. ఈనెల 14న జీరో టికెట్ల జారీ ప్రారంభం కాగా, 20వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లో పరిశీలిస్తే మొత్తం ప్రయాణికుల్లో 49.04 శాతం మంది మహిళలే ఉండడం విశేషం. వీరి ద్వారా వారం రోజుల్లో ఆర్టీసీకి రూ.2.93 కోట్ల ఆదాయం సమకూరనుంది. మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు రీజియన్‌లో ప్రయాణికులందరితో కలిపి రోజుకు రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చేది. ఈ పథకంతో మహిళా ప్రయాణికులు పెరగగా... జీరో టికెట్ల ఆధారంగా మహిళల చార్జీలను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుండడంతో సగటున రోజుకు రూ.1.40 కోట్ల ఆదాయం వస్తోంది. తద్వారా మహాలక్ష్మి ప్రారంభానికి ముందుతో పోలిస్తే ఆర్టీసీకి రికార్డు స్థాయిలో రోజుకు రూ.35 లక్షల మేర ఆదాయం పెరిగింది. – సాక్షిప్రతినిధి,ఖమ్మం

ఉచిత ప్రయాణంతో మహిళల్లో హర్షాతిరేకాలు

- వారం రోజుల్లో గణనీయంగా పెరిగిన ఓఆర్
- మహిళల తరఫున ప్రభుత్వం ద్వారా ఆర్టీసీకి రూ.2.93 కోట్ల ఆదాయం
- గతంతో పోలిస్తే రోజుకు రూ.లక్షల్లో పెరుగుదల
- జీరో టికెట్ల ఆధారంగా ఆర్టీసీకి చెల్లించనున్న సర్కారు



ఇల్లెందు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో జీరో టికెట్లు జారీచేస్తున్న కండక్టర్

మహిళలే సగం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లెందు, మణుగూరు, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 200 పల్లె వెలుగు, 173 ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ఈనెల 14 నుంచి 20 వరకు వారం రోజుల్లో ఆయా డిపోల పరిధిలో మొత్తంగా 11,34,619 మంది ప్రయాణించగా, ఆర్టీసీకి రూ.8,49,94,227 ఆదాయం వచ్చింది. ఇందులో రూ.2,93,27,867 మహిళా ప్రయాణికుల తరఫున ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించనుంది. ఈ వారం ఏడు డిపోల పరిధిలో ప్రయాణించిన వారిలో 34.51 శాతం పురుషులు ఉండగా, 49.04 శాతం మంది మహిళలు ఉన్నారు.

నాలుగు డిపోల్లో అంత కంటే ఎక్కువ

రీజియన్‌లోని ఏడు డిపోల్లో నాలుగు డిపోల్లోని బస్సుల్లో ఈ వారం సగానికి పైగా మహిళా ప్రయాణికులే ఉన్నారు. అత్యధికంగా మణుగూరు డిపో నుంచి 56.9 శాతం మంది, కొత్తగూడెం నుంచి 54.31 శాతం, ఖమ్మం నుంచి 52.51 శాతం, ఇల్లెందు నుంచి 52.58 శాతం మంది మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించారు. విద్యార్థినులు, మహిళా ఉద్యోగులతో రద్దీ బాగా పెరిగింది. ఇక మధిరలో 42.71 శాతం, సత్తుపల్లిలో 46.62, భద్రాచలంలో 38.02 శాతం మంది ప్రయాణికులు జీరో టికెట్‌తో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గుర్తింపు తప్పనిసరి..

మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించేందుకు అడ్రస్‌తో కూడిన గుర్తింపు కార్డును తప్పనిసరి చేశారు. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులను తెలంగాణలోని చిరునామాతో ఉంటేనే అనుమతిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర మహిళలకే ఈ పథకం వర్తించేలా జాగ్రత్తలు తీసుకుంటూ, కార్డు చూపించిన వారికే టికెట్ ఇస్తున్నారు. కొన్నాళ్లు జిరాక్స్, ఫోన్‌లో ఉన్న కాపీని అనుమతించినా.. ఇప్పుడు మాత్రం ఒరిజినల్ ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

మా విద్యార్థినులకు కలిసొచ్చింది..



మహాలక్ష్మిపథకం మా స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థినులకు కలిసొచ్చింది. పథకం ప్రారంభమయ్యాక కిన్నెరసాని, వరంగల్, ఖమ్మంలో జరిగిన క్రీడాపోటీలకు విద్యార్థినులను తీసుకెళ్లాం. అంతకుముందు రూ.4 వేల వరకు చార్జీలకు అయ్యేది. ఇప్పుడు భారం తప్పింది. – జి.దివ్య, కబడ్డీ కోచ్, గర్ల్స్ స్పోర్ట్స్ స్కూల్, కాచనపల్లి, గుండాల మండలం

గుర్తింపుకార్డు తప్పనిసరి



మహిళలు చిరునామాతో ఉన్న ఒరిజినల్ గుర్తింపు కార్డులు చూపించాలి. ఆధార్, ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్‌ల్లో ఒకటి ఉండాలి. పాన్‌కార్డులపై అడ్రస్ లేనందున అనుమతించడం లేదు. తెలంగాణ మహిళలే లబ్ధి పొందేలా అందరూ మా కండక్టర్లకు సహకరించాలి. – సీహెచ్.వెంకన్న, ఆర్టీసీ ఆర్‌ఎం, ఖమ్మం

రాఖీపౌర్ణమిని తలపించేలా..

ఈ ఏడాది రాఖీ పౌర్ణమి రోజున ఆర్టీసీ ఖజానా గలగలలాడింది. రాఖీ కట్టేందుకు వెళ్లి, వచ్చిన వారు 90 శాతం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడంతో ఆ రోజు రూ.1.40 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం మహిళల తరఫున చెల్లించే నగదుతో పాటు పురుషుల టికెట్ల ద్వారా రోజుకు సగటున రూ.1.40 కోట్లు వస్తుండడం ఆర్టీసీ అధికారుల్లో ఆనందాన్ని నింపుతోంది. రోజువారీగా రీజియన్‌లోని అన్ని డిపోల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య, రావాల్సిన ఆదాయం వివరాల నివేదికను ఎండీకి అధికారులు పంపిస్తున్నారు.

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జీరో టికెట్‌తో ప్రయాణించిన మహిళలు, ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి అందే ఆదాయం

డిపో	ప్రయాణికులు	ఆదాయం
ఖమ్మం	1,49,630	రూ.76,94,029
సత్తుపల్లి	1,05,042	రూ.43,09,530
మణుగూరు	89,287	రూ.44,64,890
కొత్తగూడెం	73,058	రూ.36,24,985
మధిర	60,873	రూ.42,50,443
భద్రాచలం	56,386	రూ.39,74,740
ఇల్లెందు	22,121	రూ.10,09,250
మొత్తం	5,56,397	రూ.2,93,27,867

కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

- 300 రకాల ఆన్‌లైన్ సేవలే లక్ష్యం
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



శిక్షణలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

ఖమ్మంవ్యవసాయం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)ను కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల కార్యదర్శులకు ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సెంటర్ల నిర్వహణపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి ప్రయోజనం కలిగేలా పీఏసీఎస్‌ల్లో 300 రకాల సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, రైల్వే టికెట్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, హెల్త్ సర్వీసెస్ వంటి సేవలను సహకార సంఘాల ద్వారా మారుమూల ప్రాంతాల వరకు కూడా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. జిల్లా సహకార అధికారి విజయ కుమారి, బ్యాంకు సీఈఓ ఐబీద్ ఉర్ రెహమాన్, జనరల్ మేనేజర్ నర్మద, డిప్యూటీ జనరల్ మేనేజర్ పద్మావతి, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా ఉపేందర్‌రావు



ఉపేందర్‌రావు

నేలకొండపల్లి: సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా నేలకొండపల్లికి చెందిన బీజేపీ నాయకుడు కసమర్లపూడి ఉపేందర్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పదవిలో ఉపేందర్‌రావు రెండేళ్ల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని వెల్లడించగా, ఉపేందర్‌రావును బీజేపీ జిల్లా, మండల కార్యదర్శులు నున్నా రవికుమార్, పాగర్తి సుధాకర్ అభినందించారు.

రిజిస్ట్రేషన్లలో తప్పటడుగులు

- రెండు నెలల క్రితం కూసుమంచి కార్యాలయంలో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేని సమయాన సీనియర్ అసిస్టెంట్ అనుమతి లేని భూమికి రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. విచారణలో నిజమేనని తేలడంతో సదరు ఉద్యోగిని సస్పెండ్ చేశారు.
- వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏడాది వ్యవధిలోనే ముగ్గురు ఇన్‌చార్జిలను మార్చారు. ఇక్కడ రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగిస్తుండగా ఆరోపణలు రాగానే బదిలీ చేస్తున్నారు. వైరా, కొణిజర్ల మండలాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఆరోపణలు రావడంతో వారం క్రితం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సీనియర్ అసిస్టెంట్‌ను ఖమ్మం బదిలీ చేసి, ఇక్కడి ఉద్యోగికి వైరా బాధ్యతలు అప్పగించారు. అయితే రెగ్యులర్ అధికారిని నియమించకుండా.. మళ్లీ సీనియర్ అసిస్టెంట్‌నే ఇన్‌చార్జిగా నియమించడంతో ఉన్నతాధికారుల తీరుపైనా విమర్శలు వస్తున్నాయి.



- ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని విమర్శలు
- ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు ఉన్నచోట్ల అక్రమాల పరంపర
- ఇటీవల కాలంలో పలువురిపై సస్పెన్షన్ వేటు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లో మొదటగా ఉండే స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ గాడితప్పుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల్లో జరుగుతున్న దందా చర్చనీయాంశంగా మారుతోంది. లింక్ డాక్యుమెంట్లు లేకున్నా, అనుమతులు లేని స్థలాలను రిజిస్ట్రేషన్ చేయొద్దనే నిబంధనలు ఉన్నా పట్టించుకోకుండా పలువురు అధికారులు పని కానిచ్చేస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి దస్తావేజులను కనీసం పరిశీలించకుండానే సంతకాలు పెట్టేస్తున్నారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు ఉన్న చోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. వీరికి తోడు ఇటీవల పలుచోట్ల విధుల్లో చేరిన రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు సైతం అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్ల కాలంలో అక్రమ రిజిస్ట్రేషన్ల సంఖ్య వందల్లో జరిగినట్లు అధికారుల విచారణలో తేలిందని సమాచారం.

ఇన్‌చార్జ్‌లతోనే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చిట్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఖమ్మం, ఖమ్మంరూరల్, కూసుమంచి, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందులో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు.. వైరా, కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపాడు కార్యాలయాల్లో ఇన్‌చార్జిలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ఉన్న వారంతా సీనియర్ అసిస్టెంట్లే కాగా, అక్రమాలకు పాల్పడుతున్నారనే చర్చ జరుగుతోంది. కూసుమంచి, వైరా, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇటీవల ఈ ఆరోపణలు అధికమయ్యాయి. గతంలో ఖమ్మంరూరల్, మధిరలో సైతం ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు చేసిన సమయాన ఇన్‌చార్జ్‌లే విధుల్లో ఉండడం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందినట్లు సమాచారం. దీంతో విచారణ చేపట్టిన అధికారులు బాధ్యులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. రెండు నెలల కాలంలో ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయగా.. ఇటీవల మరో కార్యాలయంలో ఉద్యోగులను బదిలీ చేసి కొత్త వారికి ఇన్‌చార్జి అప్పగించారు. ఇటీవల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఒకరిద్దరు అనుమతి లేని భూములకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. ఖమ్మం నగర శివార్లలో రూ.కోట్ల విలువైన అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ పూర్తిచేశారని తెలిసింది. కొత్తగూడెంలో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు రావడంతో ఆయన సెలవులో వెళ్లారు. ఈమేరకు ఉన్నతాధికారులు విచారణ జరుపుతూనే ఇంకో ఉద్యోగికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

విచారణ చేస్తున్నాం..



కొత్తగూడెం, వైరాలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. అక్కడ జరిగిన రిజిస్ట్రేషన్లపై విచారణ చేస్తున్నాం. ఆయా కార్యాలయాల్లో విధుల్లో ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశాం. కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో డీఆర్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చాం. విచారణలో అక్రమాలు నిజమేనని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. – చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం

నేడే జలవిహారం

- భద్రాద్రిలో నేడు స్వామివారి తెప్పోత్సవం
- భారీగా తరలివస్తున్న భక్తులు



రామయ్య విహారానికి సిద్ధమైన హంసవాహనం

భద్రాచలం: ధనుర్మాసంలో పరుచుకునే మంచు తెరలు.. ఆ మంచు తెరలను చీల్చుకుంటూ పరుచుకునే దశమి నాటి వెన్నెల వెలుగుల మధ్య గలగలా పారే గోదావరిలో నేడు హంసవాహనంపై సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి విహరించనున్నారు. భద్రగిరి చుట్టూ పరుచుకున్న ఇసుక తిన్నెల్లో కూర్చుని ఈ వేడుకను కనులారా చూసేందుకు భక్తులు భద్రాచలానికి బారులు దీరుతున్నారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలంలోని గోదావరి నదిలో శుక్రవారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ముందుగా దర్బారు సేవ

పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా నేడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవ మూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేస్తారు. అంతకు ముందు సేవాకాలం, శ్రీ తిరుమంగై అళ్వార్ల పరమపదోత్సవాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్ పత్తు ఉత్సవాలు ముగుస్తాయి. అనంతరం గర్భగుడిలో ప్రభుత్సోత్సవం(దర్బార్ సేవ) చేపడతారు.

పల్లకీలో గోదావరికి..

సాయంత్రం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకొస్తారు. రామయ్య బయలుదేరిన విషయం తెలిసిన వెంటనే పుణ్య జలాలతో హంస వాహనాన్ని సంప్రోక్షణ చేస్తారు. ఊరేగింపుగా పల్లకీలో వచ్చిన దేవేరులను హంసవాహనంలోని పచ్చిపూల మండపంలో తూర్పు ముఖంగా వేంచేపు చేస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయర దివ్యప్రబంధం, స్తోత్ర పాఠాలు, పంచసూక్తాలు పఠిస్తారు. అనంతరం చక్కెరపొంగలి నివేదన చేసి, మంగళహారతి ఇస్తారు.

ఉత్తర దిశగా ప్రయాణం

ఆగమ శాస్త్ర పూజాదికాలు పూర్తయ్యాక రామయ్య కొలువుదీరిన హంస వాహనం ఉత్తర ముఖంగా గోదావరిలో ప్రయాణం సాగిస్తుంది. ఆ తర్వాత తూర్పు, అటు నుంచి దక్షిణం, చివరకు పడమర దిశకు చేరుకుని నదిలో పరిక్రమణం పూర్తిచేస్తారు. ఇలా ఐదు పరిక్రమణలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. సగటున ఒక్కో పరిక్రమణానికి 12 నిమిషాల చొప్పున సుమారు గంటపాటు తెప్పోత్సవం అంగరంగ వైభవంగా సాగనుండగా... ఆగమ శాస్త్ర పద్ధతులను అనుసరిస్తూ సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకొస్తారు.

భద్రగిరికి భారీగా భక్తులు

సాధారణంగా తెప్పోత్సవం, ముక్కోటి ఏకాదశికి భారీగా భక్తులు వస్తుంటారు. అయితే ఈసారి మహాలక్ష్మి పథకం అమల్లో ఉండడంతో మహిళా భక్తులు భారీ సంఖ్యలో భద్రాద్రికి వస్తారనే అంచనాలు ఉన్నాయి. కాగా, గతంలో మాదిరిగానే అధికారులు ఏర్పాటుచేయడంపై పెదవి విరుస్తున్నారు. మహిళల రద్దీకి తగ్గట్టుగా గోదావరి తీరం వెంట, ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, దుస్తులు మార్చుకునే కేంద్రాలు, టాయిలెట్లు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

శ్రీ కృష్ణుడిగా రామయ్య



కృష్ణావతారంలోని రామయ్యకు పూజ చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: ముగ్ధమనోహర రూపం, చూడచక్కని ఆకారం, కిరీటంపై నెమలి పింఛం, చెంతనే సీతామహాదేవి, పక్కనే లక్ష్మణస్వామితో బంగారపు ఊయలలో ఊగుతూ శ్రీ కృష్ణావతారంలో భద్రాద్రి రామయ్య దర్శనమివ్వగా.. భక్తులు బ్రహ్మరథం పట్టారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామిని గురువారం శ్రీ కృష్ణుడిగా అలంకరించారు. తొమ్మిది రోజులుగా స్వామివారిని రోజుకో రూపంలో అలంకరిస్తుండగా కృష్ణావతారంతో ఈ వేడుకలు ముగిశాయి. ఈసందర్భంగా రామయ్యకు వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఆస్థాన విద్వాంసులు కీర్తనలు ఆలపిస్తుండగా అర్చకులు ఊయలలో ఊపుతూ వేదమంత్రాలు పఠించారు. అనంతరం హారతి సమర్పించారు. ఆతర్వాత పల్లకీ సేవగా మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకొచ్చి ఆశీనులను చేసి భక్తుల దర్శనానంతరం తిరువీధి సేవ నిర్వహించారు. అస్థాన మండపంలో స్వామి వారికి దర్బార్ సేవ, ఆరాధన, నివేదన సమర్పించిన తర్వాత పవళింపు సేవ చేశారు.

ముక్కోటి ఏర్పాట్లు పూర్తి

- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ
- ఈసారి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం తెప్పోత్సవం, శనివారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనుండగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. తెప్పోత్సవం జరిగే ప్రదేశంలో భారీగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతోపాటు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయించారు. సమాచార కేంద్రాలు, వైద్య శిబిరాలను సిద్ధం చేశారు. పారిశుద్ధ్య పనులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక భద్రాచలం నుంచి పర్ణశాలకు గురువారం నుంచే ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. గతేడాది కంటే ఈ సారి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనున్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్టీసీలో మహిళలకు ప్రయాణం ఉచితం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ఇందుకు అనుగుణంగా పలు రూట్లల్లో బస్సుల సంఖ్యను పెంచుతున్నట్లు తెలిపారు.


తెప్పోత్సవం జరిగే ప్రదేశంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాలు

భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు

ప్రసాదం కౌంటర్లు : ఆలయం తూర్పు మెట్ల వద్ద 6 కౌంటర్లతో పాటు దేవస్థానం అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు.
పార్కింగ్: కల్యాణ మండప స్టేడియం వద్ద
ఉచిత వసతి సౌకర్యం: విస్తా కాంప్లెక్స్ పక్కన


సమాచార కేంద్రం

సమాచార కేంద్రాలు

1. ఆంజనేయ స్వామి విగ్రహం
2. ఆర్టీసీ బస్టాండ్
3. తానీషా కల్యాణ మండపం
4. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద

ప్రథమ చికిత్స కేంద్రాలు

1. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో
2. ఆర్టీసీ బస్టాండ్
3. విస్తా కాంప్లెక్స్
4. గోదావరి ఘాట్
5. కల్యాణ మండపం
6. ఆలయ ప్రాంగణంలో
7. తానీషా కల్యాణ మండపం
8. సాధువుల మండపం

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం పుణ్యక్షేత్రంలో జరిగే ఉత్తర ద్వార దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఖమ్మం రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి శనివారం ప్రత్యేక బస్సులు నడిపిస్తామని ఆర్ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు. కొత్తగూడెం డిపో నుంచి ఆరు, ఖమ్మం, మణుగూరు డిపోల నుంచి ఐదు చొప్పున, సత్తుపల్లి, మధిర నుంచి నాలుగు చొప్పున, ఇల్లెందు డిపో నుంచి రెండు చొప్పున అదనపు బస్సులు ఏర్పాటుచేసి భద్రాచలానికి 48 ట్రిప్పులు నడిపించనున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తామని ఆర్ఎం తెలిపారు.

ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు ఆన్‌లైన్ ద్వారా దర్శనం టికెట్లు, రూములను బుక్ చేసుకునే అవకాశం ఉందని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా ఉత్తర ద్వార దర్శనం, వసతి గదులను బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

భక్తుల అవగాహనకు ఫ్లెక్సీలు ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం సమాచారం ఇచ్చేలా అధికారులు పోస్టర్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ స్థలానికి దారి, దేవస్థానం ఏర్పాటు చేసిన లడ్డూ కౌంటర్, సెక్టార్ల విభజనపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణవ్యాప్తంగా ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్నారు.


బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న పోలీస్ సిబ్బంది

ఆ సమయంలో పాతబస్టాండ్ మీదుగా..

ఖమ్మం మామిళ్లగూడెం: రాత్రి సమయాన ప్రయాణికుల ఇబ్బందులపై వచ్చిన విజ్ఞప్తిని పరిగణనలో తీసుకుని రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి మొదలయ్యే ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను వయా పాత బస్టాండ్ మీదుగా నడిపిస్తున్నామని ఆర్ఎం సీహెచ్.వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌నుంచి ఖమ్మం వచ్చే బస్సులు కాల్వొడ్డు, మయూరిసెంటర్, ఖమ్మం డిపోరోడ్, రాపర్తినగర్ మీదుగా కొత్త బస్టాండ్‌కు చేరుకుంటాయని పేర్కొన్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే బస్సులు ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీ సెంటర్, మయూరిసెంటర్, ఖమ్మం డిపో రోడ్, రాపర్తి నగర్ మీదుగా కొత్త బస్టాండ్‌కు చేరుకుంటాయని తెలిపారు. అయితే, సూపర్ లగ్జరీ, రాజధాని బస్సుల నిర్వహణలో మాత్రం ఎలాంటి మార్పు లేదని వెల్లడించారు.

కేంద్రం తీరును నిరసిస్తూ నేడు ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా పార్టీల సంయుక్త సమావేశం గురువారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయా పార్టీల జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిఒక్కరిని సస్పెండ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈమేరకు కేంద్రం వైకరిని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు, వామపక్ష కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వరరావు, ఆవుల అశోక్, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

క్లుప్తంగా

ఆర్చరీ మీట్‌లో రజిత పతకం

ఖమ్మంస్పోర్ట్స్: పంజాబ్ రాష్ట్రంలోని గురుకాశీ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగిన సౌత్ వెస్ట్ యూనివర్సిటీల స్థాయి ఆర్చరీ పోటీల్లో ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల విద్యార్థి కె.లక్ష్మణ్ రజిత పతకం దక్కించుకున్నారు. ఈపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారుడికి 321 పాయింట్లు రాగా, లక్ష్మణ్‌కు 320 పాయింట్లు వచ్చాయి. దీంతో తృటిలో స్వర్ణ పతకం చేజారినట్లయింది. ఈసందర్భంగా లక్ష్మణ్‌ను ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఏసీపీ సాదుల సారంగపాణి, కార్యదర్శి పుట్టా శంకరయ్య, డీవైఎస్ఓ తుంబూరు సునీల్‌రెడ్డి, కోచ్ నగేష్ అభినందించారు.



పతకంతో లక్ష్మణ్

28, 29 తేదీల్లో ఖమ్మం జోన్ క్రికెట్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి (ఖమ్మం జోన్) డిగ్రీ, పీజీ కళాశాలల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈనె 28, 29వ తేదీల్లో నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి డాక్టర్.బి.వెంకన్న తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే పోటీలకు ప్రతీ డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు క్రికెటర్ల చొప్పున సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులైతే మెమోలు, ప్రథమ సంవత్సరం వారైతే 17 ఏళ్ల వయసు కలిగి ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలతో కళాశాల గుర్తింపు కార్డుతో రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94412 36384 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల ప్రదానోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాలను శనివారం ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు రవిమారుత్ తెలిపారు. ఈసందర్భంగా 'ఖమ్మం 2023 ఈస్తటిక్స్ కథలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. సాహితీవేత్తలు ప్రసేన్, సీతారాం, మువ్వా శ్రీనివాసరావు, వంశీకృష్ణ, ఫణిమాధవి కన్నోజు, పగిడిపల్లి వెంకటేశ్వర్లుతో పాటు ఓల్గా, ఎల్ఎస్ఆర్.ప్రసాద్, కత్తి పద్మ, ప్రసాదమూర్తి, అట్టాడ అప్పల్నాయుడు, రమణమూర్తి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, రమణ జీవి, ముక్కాముల చక్రధర్, అనంతు తదితరులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, విద్యావేత్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పీఓ ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చేనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఫిబ్రవరి 11న పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని, పూర్తి వివరాలకు గిరిజన సంక్షేమ శాఖ విద్యాలయాల్లో సంప్రదించాలని పీఓ తెలిపారు.

ప్రభుత్వానికి అన్నివిధాలా సహకరిస్తాం..

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు



మాట్లాడుతున్న మోత్కూరి మధు

సత్తుపల్లి: ప్రజాభీష్టం మేరకు ఎన్నికైన రాష్ట్రప్రభుత్వానికి పీఆర్టీయూ సంఘం తరఫున సహకరిస్తూ మద్దతుగా నిలుస్తామని జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు తెలిపారు. సత్తుపల్లిలోని సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా రాష్ట్ర, జిల్లా శాఖలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. పాలక ప్రభుత్వం, ప్రజాప్రతినిధులతో స్నేహపూర్వక వైఖరిని కొనసాగిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సౌకర్యాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. కాగా, పెండింగ్ బిల్లులకు నిధులు మంజూరు చేయడంతో పాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో పీఆర్టీయూ నాయకులు చిత్తలూరి ప్రసాద్, వై.వెంకటేశ్వర్లు, చెన్నకేశవరెడ్డి, ప్రసాద్, శ్రీను, రవి, వెంకటేశ్వరరావు, యుగంధర్, రత్నాకర్, అజయ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,850	7,700
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	23,600	18,500
కొత్త మిర్చి	23,500	23,500
పత్తి	6,800	3,500

– ఖమ్మం వ్యవసాయం

డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి


పాఠశాలలో విద్యార్థులకు పాఠం బోధిస్తున్న కలెక్టర్ గౌతమ్

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్నారని తెలియడంతో అసంతృప్తి

నేలకొండపల్లి: అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కలెక్టర్ పర్యటించారు. తొలుత స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన కాసేపు విద్యార్థులకు పాఠం బోధించారు. బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నట్లు తెలియగా ఎంఈఓపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అలాగే, నేలకొండపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు-మన బడి పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన కలెక్టర్ అక్కడ డాక్టర్ కె.రాజేష్ మాత్రమే ఉన్నా మెరుగైన వైద్యం అందచేస్తున్నారని స్థానికులు తెలపగా వైద్యుడిని అభినందించారు. ఖాళీ పోస్టులు త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. కాగా, నేలకొండపల్లికి చెందిన జెడ్పీటీసీ పోతుల సత్యనారాయణ, పసుమర్తి శ్రీనివాస్ తదితరులు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. డీఈఓ సోమశేఖర్ శర్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ సీ.హెచ్.శివ, తహసీల్దార్ అరుణాబాయి, ఎంఈఓ బీ.రాములు, ఆర్ఐ ఆలస్యం మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: రెవెన్యూ సంబంధిత సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన రెవెన్యూ అధికారులతో ధరణి, రిజిస్ట్రేషన్లు, భూసేకరణ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధ దరఖాస్తుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు చేపడుతున్న భూసేకరణలో వేగం పెంచాలని, రిజిస్ట్రేషన్లకు సబంధించి స్లాట్లు పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. వేర్ హౌజింగ్ గోడౌన్ల కోసం ఒక్కో డివిజన్‌లో 50 ఎకరాల చొప్పున భూ సేకరణ చేయాలని తెలిపారు. కాగా, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పండుగల వేళ కరోనా అలజడి

- కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు
- సమీపించిన క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఖమ్మంగాంధీచౌక్: వరుసగా పండుగలు వస్తున్న వేళ కరోనా కొత్త వేరియంట్ వెలుగు చూడడం కలకలం రేపుతోంది. ఖమ్మంలోనూ తాజాగా ఓ కేసు నమోదు కాగా... కేసులు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం, వైద్యులు సూచిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతుండగా.. మరో వైపు మరో వైపు క్రిస్మస్ వేడుకలకు వేళయింది. అలాగే, నూతన సంవత్సర వేడుకలు సమీపించాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హిందువులు ఆలయాలకు బారులుదీరుతుంగా, శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రద్దీ మరింతపెరుగుతుంది. ఇక ఏసుక్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్ పండుగా క్రిస్టియన్లు వైభవంగా జరుపుకుంటారు. చర్చిలకు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రార్థనలు చేస్తారు. అలాగే, నూతన సంవత్సర వేడుకలను చిన్నాపెద్ద ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఇదే సమయాన కరోనా కేసులు వెలుగు చూస్తుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యాన ఆలయాలు, చర్చిల నిర్వాహకులు అప్రమత్తమవుతున్నారు. భక్తుల తాకిడి పెరగనుండడంతో కరోనా నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. ప్రతీఒక్కరు మాస్క్ ధరించి రావాలని వాట్సాప్ గ్రూపుల ద్వారా భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి కానీ ఏ ఇతర ప్రభుత్వ శాఖల నుంచి కరోనా నిబంధనలపై ఆదేశాలు జారీ కాలేదు. అయినప్పటికీ నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తగా సూచనలు చేస్తుండగా, ఆనందాల నడుమ పండుగలను జరుపుకునేందుకు సిద్ధమైన వేళ కరోనా కేసులు వస్తుండడం ఆందోళనగా ఉందని భక్తులు చెబుతున్నారు.

వరికోత యంత్రం డ్రైవర్‌కు విద్యుత్‌షాక్

వైరారూరల్: మండలంలోని లింగన్నపాలెంలో గురువారం హార్వెస్టర్‌తో వరికోత చేస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రానికి విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ షాక్‌కు గురయ్యాడు. తమిళనాడుకు చెందిన హార్వెస్టర్ డ్రైవర్ ధర్మదూరి కార్తికేయ గ్రామంలో వరికోతకు రాగా ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో అపస్మారక స్థితిలో పడిపోయిన డ్రైవర్‌ను గ్రామానికే చెందిన చంగల పరశురాము వైరాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

బడ్డీ కొట్టుపైకి దూసుకెళ్లిన మిల్లర్

వైరారూరల్: వ్యాన్‌కు కట్టుకుని తీసుకెళ్తున్న కంకర్ మిల్లర్ అదుపుతప్పి బడ్డీ కొట్టుపైకి దూసుకెళ్లడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మిల్లర్‌ను తాడుతో వ్యాన్‌కు కట్టుకుని గురువారం తల్లాడ వైపు నుండి వైరా బయలుదేరారు. వైరా మండలం స్టేజీ పినపాక వద్ద మిల్లర్‌కు కట్టిన తాడు తెగి జాతీయ రహదారికి పక్కన ఉన్న బడ్డీ కొట్టుపైకి మిల్లర్ దూసుకెళ్లింది. దీంతో షాపు వద్ద ఉన్న షేక్ నజార్‌కు గాయాలు కాగా వైరాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


అదుపు తప్పి బోల్తా పడిన మిల్లర్

బస్సును దగ్ధం చేసిన మావోయిస్టులు

చర్ల: బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో విప్లవోద్యమంపై ప్రభుత్వ బలగాలు కొనసాగిస్తున్న అణచివేతను నిరసిస్తూ ఈ నెల 22న భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు వరుస విధ్వంసాలకు పాల్పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలోని సుకుమా, దంతెవాడ, గడ్చిరోలి జిల్లాల్లో బస్సులు, లారీలు, కార్లు, రోడ్డు పనులకు వినియోగిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలను దగ్ధం చేశారు. తాజాగా బీజాపూర్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున మద్దేడు సమీపంలో ఉన్న సోమన్‌పల్లిలో సెల్ టవర్ కంట్రోల్ రూంకు నిప్పటించారు. ఇదే జిల్లాలోని ఆవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దుర్గాయిగూడ సమీపంలో ఆవుపల్లి నుంచి రాయ్‌పూర్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సును నిలిపివేసి, ప్రయాణికులను కిందకు దించారు. అనంతరం డీజిల్ ట్యాంకును పగులగొట్టి నిప్పంటించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది.

వ్యక్తిపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: ట్రిపుల్ తలాక్ విషయంలో ఓ వ్యక్తిపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదయింది. త్రీటౌన్ సీఐ మురళి కథనం ప్రకారం.. మేదరబస్తీకి చెందిన మహిళకు, పాల్వంచ బొల్లోరిగూడేనికి చెందిన షేక్ జమీల్‌కు 2013లో వివాహం జరిగింది. ఇరువురి మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో గత జూలైలో ఇద్దరూ సాక్షుల సమక్షంలో ట్రిపుల్ తలాక్ చెప్పుకుని విడాకులు తీసుకున్నట్లు భర్త జమీల్ భార్యకు లాయర్ నోటీసును పంపించాడు. కాగా తనకు న్యాయం చేయాలని భార్య జాతీయ మైనారిటీ కమిషన్‌ను ఆశ్రయించింది. కమిషన్ విచారణ జరిపి జమీల్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశించగా.. పోలీసులు ముస్లిం ఉమెన్ ప్రొటెక్ట్‌యాక్ట్-2019 ప్రకారం కేసు నమోదు చేశారు.

లీకేజీలతో తప్పని అవస్థలు

ఖమ్మం వైద్యవిభాగం: సాధారణంగా వర్షాకాలంలో భవనాలపై నీరు నిలిచి లీకేజీలతో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. కానీ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో లీకేజీలు నిత్యకృత్యమయ్యాయి. ఆస్పత్రిలోని ఓ బ్లాక్ 50 ఏళ్ల క్రితం నిర్మించినది కాగా, కొంత భాగం కార్యాలయానికి.. ఇంకొంత భాగం వైద్య సేవలకు వినియోగిస్తున్నారు. ఈ భవనంపై నీళ్ల ట్యాంకులు నింపినప్పుడు ఓవర్‌ఫ్లో అవుతుంటాయి. ఆ నీరు లీకేజీల ద్వారా కిందకు కారుతుండడంతో ఉద్యోగులు థర్మకోల్ పెట్టెలు పెట్టి నీరు నిండగానే బయట పోస్తున్నారు. ఈ సమస్య చాన్నాళ్లుగా ఉన్నా అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా మాత్రం దృష్టి సారించడం లేదు.


నీరు కారుతున్న చోట పెట్టిన థర్మకోల్ పెట్టెలు